క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన తాటి

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండలంలోని గండుగులపల్లి నివాసంలో.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ జిల్లా నాయకత్వంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో, ఆయన తుమ్మలను కలవడం చర్చాంశనీయంగా మారింది.

వైభవోపేతంగా వేంకటేశ్వర కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రోత్సరణల నడుమ స్వామివారి క్రతువు జరిపించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు పెంచాలి



ఉప్పుసాకలో మొక్కలు నాటుతున్న ఇండోఫిల్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

బూర్గంపాడు: సామాజిక బాధ్యతగా అందరు మొక్కలు పెంచాలని ఇండోఫిల్ జిల్లా ఇన్‌చార్జ్ మధుకర్ అన్నారు. ఇండోఫిల్ కంపెనీ సామాజిక బాధ్యతగా శుక్రవారం నకిరిపేట, ఉప్పుసాక పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సామాజిక బాధ్యతగా 50వేల మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు వెంకటేశ్వర్లు, బీమా, ఉపాధ్యాయులు మధు, ఇండోఫిల్ ప్రతినిధులు రాకేష్, సురేష్, రవీందర్‌రెడ్డి, సమర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు



విద్యార్థులకు ప్రమిదలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: అజ్ఞానంపై జ్ఞానం, అధర్మం పై ధర్మం, చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ అని కూనవరం ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్ అన్నారు. శనివారం పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. దీపం వెలుగు చైతన్యానికి నిదర్శనమని, ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు ప్రమీదలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు కె.సారయ్య, రుక్మిణి, సరిత, రఘుమోహన్‌రావు, జయలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

మరమ్మతులు హర్షణీయం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కార్మికుల కుటుంబాలు నివాసముండే కాలనీ రోడ్లకు కోట్లాది రూపాయల నిధులతో మరమ్మతులు చేపట్టడం హర్షణీయమని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధ్వానంగా ఉన్న కాలనీ రోడ్లపై పలుమార్లు వినతులు అందించిన నేపథ్యంలో సింగరేణి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు ఇటీవల మరణించగా.. ఆయన కుటుంబానికి వెంకటాపురం గ్రామానికి చెందిన ఆదివాసీ యువత చందాలు సేకరించి సాయం అందించారు. మొత్తం రూ.6,100తో పాటు నిత్యావసరాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొమరం రవి,పోలెబోయిన రామారావు, పోలెబోయిన వెంకటనారాయణ, చందా ప్రదీప్, పూనెం లక్ష్మణ్, కొమరం వరుణ్, ప్రశాంత్, ప్రవీణ్, కృష్ణ పాల్గొన్నారు.



వెరైటీ డిజైన్లలో పింగాణి బొమ్మ ప్రమిదలు



ఆకర్షణీయమైన దీపాలు



హంస డిజైన్లు..

దీపం.. విభిన్న రూపం

- ఆకర్షణీయంగా మట్టి దీపాలు
- వివిధ బొమ్మల ఆకృతుల్లో తయారు..
- విద్యుత్ దీపాల్లోనూ వెరైటీలు

భద్రాచలంటౌన్: దీపావళి పండుగ అంటేనే చీకటిని పారదోలుతూ.. వెలుగులు తెచ్చే పండుగ. ఆ వెలుగులు నింపేది దీపాలే. అందులోనూ మట్టితో తయ్యారు చేసే ప్రమిదలు దీపావళి పండుగలో మహిళలకు ప్రత్యేకం. దీంతో వ్యాపారులు వివిధ రకాల వెరైటీలలో మట్టి, పిగాణి ప్రమిదలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అధునాతన ఎల్ఈడీ లైట్ల దండలు కూడా ఆకర్షణీయ రూపాల్లో అందుబాటులోకి వచ్చాచ్చారు. భద్రాచలం పట్టణంలోని వీటి దుకాణాలు రోడ్డు పక్కన ఏర్పాటు చేయగా, ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

కాలానుగుణంగా మార్పులు

ఒక్కప్పుడు దీపావళి అనగానే అందరికీ టక్కున గుర్తుకు వచ్చేది టపాసులు. పండుగకు నెల రోజుల ముందు నుంచే చిన్న పిల్లలు టపాసులు పేల్చుతూ ఉండేది. పండుగకు కొన్ని రోజుల నుంచే ఎక్కడో ఒకచోట టపాసుల శబ్దం వినిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాలానుగుణంగా ప్రజల ఆలోచనా విధానం మారింది. టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఈ కారణంగా ప్రజలు టపాసులను కాల్చడం చాలా వరకు తగ్గించి, దీపాలపై మనసు నిలిపారు. కేవలం దీపావళి రోజు మాత్రమే పిల్లల ఆనందం కోసం ప్రజలు టపాసులు కాల్చుతూ.. దీపాలతో పరిసరాలను నింపడం మొదలెట్టారు.

దీపాలతోనే వేడుక..



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

టపాసులు కాల్చడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలిసిన వారు దీపాలతోనే దివాళీ వేడుకలను జరుపుకుంటున్నారు. ముఖ్యం మహిళలు దీపాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందువల్ల వ్యాపారులు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికత, సాంకేతికతను కలబోస్తూ నేటి తరానికి నచ్చే రీతలో అనేక డిజైన్లలో దీపాలను అందుబాటులోకి తీస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే ఒరవడి కొనసాగింది. పండుగకు ఒక్కరోజే ఉండడంతో పట్టణాలలో దీపాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహిళలే కాక పురుషులు కూడా ఆకర్షణీయంగా ఉండే దీపాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు.

డిజైన్‌కు తగ్గట్టు ధరలు

ప్రస్తుతం ఆధునికత కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు, పాత ఇళ్లను రీమోడల్ చేసుకునే వారు వారి ఆర్థిక స్తోమతను బట్టి గృహాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఈ కారణంగా దీపావళి సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తగ్గట్లు ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలలో దీపాలను వెలిగించేందుకు మక్కువ చూపుతున్నారు.ఇప్పుడు మట్టి ప్రమిదలతో పాటు పింగాణి దీపాలు, విద్యుత్ ద్వారా వెలిగే దీపాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క దీపం రూ.10 నుంచి 300 వరకు ధర పలుకుతుంది. వ్యాపారులు వివిధ రకాల విద్యుత్ అలంకరణ దీపాలను రాజస్థాన్, కలకత్త, తమిళనాడు, బెంగళూర్ వంటి ప్రాంతాల నుంచి తెప్పించి అమ్ముతున్నారు. గోల్డ్ కలర్‌లో ఆకర్షణీయంగా ఉండే తోరణాలు రూ.600ల నుంచి అమ్మకాలు జరుతున్నాయి. దీంతో ఆకర్షణీయంగా ఉండే వాటిని, వెరైటీ డిజైన్లలో లభించే వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

సండే స్పెషల్

బొమ్మ దీపాలు బాగున్నాయి..

మార్కెట్లో పట్టి ప్రమిదలతో పాటు పింగాణి దీపాల బొమ్మలు ఆకర్షణీయంగా ఉన్నాయి. గతంలో మట్టి ప్రమిదలలోనే దీపాలను వెలిగించే వాళ్లం. కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో అందుబాటులో వెరైటీస్ లభిస్తున్నాయి. ధరలు అందుబాటులో ఉండే వాటిని కొనుగోలు చేస్తున్నాం.

– రాజేశ్వరి, భద్రాచలం

దీపాలతోనే ఇంటికి శోభ

దీపావళి పండుగ, కార్తీక మాసం సందర్భంగా ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ఇళ్లు ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. ఆకర్షణీయమైన ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. ఆకర్షణీయంగా ఉండే ప్రమిదల్లో ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ఇంటికి మరింత అందం వస్తుంది.

– రూపాదేవి, భద్రాచలం

మోడల్ ప్రమిదలకు ఆదరణ

భద్రాచలం పట్టణంలో గత పదేళ్లుగా ప్రమిదల వ్యాపారం చేస్తున్నాను. మోడల్ ప్రమిదల వ్యాపారం బాగుంటుంది. ఈ ఏడాది కూడా అమ్మకాలు బాగున్నాయి. పలు రాష్ట్రాల నుంచి తెచ్చి వెరైటీ ప్రమిదల దీపాలను కొనుగోలు చేసేందుకు ప్రజలకు ఆసక్తి చూపిస్తున్నారు.

– నాగేశ్వరరావు, ప్రమిదల వ్యాపారి

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న 108 టెక్నీషియన్ రాము

దమ్మపేట: అకస్మాత్తుగా హృదయ స్పందన ఆగిపోయినప్పుడు ఆస్పత్రికి వెళ్లేలోపు ప్రాణాలు కాపాడటానికి చేయాల్సిన కార్డియోపల్మోనరీ రిసపిటేషన్ (సీపీఆర్) ప్రక్రియ గురించి 108 సిబ్బంది, మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఒక వ్యక్తికి అకస్మాత్తుగా గుండె ఆగిపోయిన సందర్భంలో మెదడుకు రక్త ప్రసరణను నిర్వహించడానికి, ఛాతీపై గట్టిగా నొక్కడంతో పాటుగా కృత్రిమ శ్వాసను అందించే ప్రక్రియను 108 టెక్నీషియన్ చీమల రాము ప్రయోగాత్మకంగా వివరించారు. గుండెపోటు, విద్యుత్ షాక్, నీటిలో మునిపోయిన సందర్భాల్లో ఈ సీపీఆర్ ప్రక్రియను ఉపయోగించాలని తెలిపారు. గురుకుల ప్రిన్సిపాల్ సీతారాం, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, బాబు, హాతిరాం, అరుణ, 108 సిబ్బంది చీమల రాము, రమేష్, లాల్‌సింగ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

దుమ్ముగూడెం: గత ఎన్నికలకు ముందు సీపీఐని వీడి బీఆర్ఎస్‌లో చేరిన మండల సహాయ కార్యదర్శి నోముల రామిరెడ్డి శనివారం రాష్ట్ర సమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్, మండల కార్యదర్శి బొల్లోజ్ బొల్లోజు వేణు ఆధ్వర్యంలో తిరిగి సొంత గూడు సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను మరువలేక తిరిగి సీపీఐలో చేరినట్లు రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, కాకా వెంకటేశ్వరరావు, మడకం ముత్తయ్య, అపక తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ న్యూట్రీషన్ గార్డెన్ ఏర్పాటు



న్యూట్రీషన్ గార్డెన్‌లో కూరగాయల విత్తనాలు నాటుతున్న ఐసీడీఎస్ అధికారులు

కరకగూడెం: మండల పరిధిలోని తాటిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం మోడల్ న్యూట్రీషన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మణుగూరు సీడీపీఓ పాలెబోయిన జయలక్ష్మి ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయలు, ఆకుకూరల మొక్కల విత్తనాలను నాటారు. పౌష్టికాహార లోపాన్ని నివారించడంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పోషణకు అవసరమైన తాజా కూరగాయలు, ఆకుకూరలను పెంచే ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవా వరకుమార్, ఎంపీఓ మారుతీ, అనంతారం సెక్టర్ సూపర్‌వైజర్ రాజమణి, కరకగూడెం సెక్టర్ సూపర్‌వైజర్ భద్రమ్మ, పద్మ, అంగన్‌వాడీలు, ఇతర సిబ్బంది స్థానిక మహిళలు పాల్గొన్నారు.

‘అడవిని తలపిస్తున్న కాలేజీ ప్రాంగణం’



కాలేజీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ములకలపల్లి: ‘ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. పచ్చదనం పరిశుభ్రత ఊసేలేదు. అసలు ఈ కాలేజీకి విద్యార్థులు వస్తున్నారా?’ అంటూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఎమ్మెల్యే జారె ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పరిసరాలను పరిశీలించిన ఆయన నిర్వహణపై తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఎటుచేసినా చెత్తచెదారమే కనిపిస్తోందన్నారు. పలుమార్లు కళాశాలను తాను స్వయంగా కళాశాలను సందర్శించి, గార్డెనింగ్, శానిటేషన్ చేపట్టాలని తెలిపినా, మార్పు రాలేదని ఫైర్ అయ్యారు. ఇలా అయితే పిల్లలు ఎలా చదువుంటారని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అతహర్ అలీని ప్రశ్నించారు. డోజర్ ట్రాక్టర్ ఏర్పాటు చేసి, పరిశుభ్రం చేసేలా చూడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావుకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మినీస్టేడియం ఏర్పాటుకు తహసీల్దార్ భూక్యా గనియాతో కలసి సమీపంలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. డీటీ భాగ్యలక్ష్మి, నాయకులు కారం సుధీర్, శనగపాటి అంజి, రవి, మిరియాల అవినాశ్, గుర్రం జయసుధ, సురభి రాజేశ్, సుమిత్, ఆదిత్య పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు



కిందకు కుంగిపోయిన కల్వర్టు ఇదే..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో బీసీ కాలనీలో నల్లపు లీలా ప్రసాద్ ఇంటి దగ్గర్లో ఉన్న కల్వర్టు కొద్ది రోజుల క్రితం కుంగింది. దాంతో ఈ కల్వర్టు కింద నుంచి వెళ్లాల్సిన డ్రెయినేజీలోని మురుగునీరు నలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఏడాదిన్నర క్రితం పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సీసీ రోడ్డుతోపాటు కల్వర్టును నిర్మించగా.. నిర్మాణంలో సరైన నాణ్యత పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పునఃనిర్మించాలని కోరుతున్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరిని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు గురజాల గోపి కోరారు. ఈ మేరకు శనివారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసిన గోపి విన్నవించారు. ఆపై రేణుక చౌదరిని రేణుక అక్షర మండలి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రేణుక అక్షర మహిళ మండలి నాయకులు పూనెం సరోజ, షబానా, సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, డేరంగుల సుజాత, కన్నాపురం వసంత, శైలజ, ఆకూరి సౌజన్య, బాడిష పార్వతి ఉన్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు



పరుగు పందెం పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏటీడీఓ

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడలు శనివారం నాడు ముగిశాయి. శనివారం బాలికలకు క్రీడా పోటీలను, ఐటీడీఏ ఏటీడీఓ చంద్రమోహన్ చేతులమీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలకు చెందిన 200 మంది బాలికలు పలు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను, నవంబరులో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి గోపాల్, హెచ్ఎంలు రవి, చంద్రకళ, శారద వ్యాయామ ఉపాధ్యాయులు భద్రు, అశోక్, వెంకన్న, నాగేంద్రమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్ విజయవంతం

బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలని కోరుతూ.. వివిధ పార్టీలకు అతీతంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ శనివారం విజయవంతమైంది. వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతబడ్డాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు నిలిచిపోయాయి. ప్రధాన సెంటర్లు, రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నాయకులు ర్యాలీలు, ప్రదర్శనలు చేపట్టి నినాదాలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు బంద్‌కు మద్దతు ప్రకటించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: డిపోకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు



భద్రాచలంఅర్బన్: నిర్మానుష్యంగా మారిన పట్టణంలోని యూబీ రోడ్డు



అశ్వారావుపేట: మూతబడిన దుకాణాలు



దమ్మపేట: నిర్మానుష్యంగా ఉన్న దమ్మపేట ప్రధాన సెంటర్



అన్నపురెడ్డిపల్లి: రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు



ములకలపల్లి: సీపీఎం నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



భద్రాచలంఅర్బన్: నినాదాలతో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పార్టీల నాయకులు



గుండాల: బంద్‌తో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



అశ్వాపురం: మొండికుంటలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో



మణుగూరురూరల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మణుగూరురూరల్: బీటీపీఎస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీసీ ఉద్యోగులు



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు



భద్రాచలంఅర్బన్: నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ బస్టాండ్



కరకగూడెం: బంద్ నేపథ్యంలో పోలీసుల గస్తీ